క్లుప్తంగా

మామిడిలో సస్యరక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న మధుసూదన్

శ్రీరంగరాజపురం : మండలంలోని రైతులకు మామిడి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై సోమవారం వెలుగు కార్యాలయంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మామిడి పూత నుంచి కోత వరకు చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. మామిడికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకోవచ్చని సూచించారు. పామ్ మొక్కలను సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో జీడీనెల్లూరు ఉద్యానశాఖ అధికారి లోకేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే



ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురంలో పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలని తహసీల్దార్ అరుణ కుమారి ఆదేశించారు. సోమవారం ఈ మేరకు గ్రామంలోని రైతులకు సర్వేపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. దీంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని వెల్లడించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ ప్రవీణ్, వీఆర్‌ఓ వెంకటాచలం, సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యమిస్తున్నట్లు తహసీల్దార్ లోకనాథపిళ్లై తెలిపారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై 17 వినతుల వచ్చినట్లు వెల్లడించారు. ఆయా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



అలంకరణలో స్వామివారు

గంగాధర నెల్లూరు : మండలంలోని వేల్కూరులో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం హనుమాన్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకుడు నరసింహ అయ్యంగార్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం, పూజలు జరిపించారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న గంగారత్నం

గంగాధర నెల్లూరు : సేంద్రియ విధానంలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ సంస్థ ఏఎంఎంటీ గంగారత్నం, డీఎంఎంటీ ధనలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని అక్కన్నగారిపల్లెలో కళావతి అనే రైతు సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘన జీవామృతం తయారుచేసుకునే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎంటీ రాజా ప్రతాప్, హేమావతి, గణపతి పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం : మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, కుంకుమ, విబూది, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలోనే పంచముఖ అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆకర్షణీయం.. అనారోగ్యం

పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపిల్లలను ఆకర్షించడానికి వివిధ నాసిరకమైన స్నాక్స్ దర్శనమిస్తున్నాయి. వాటిలో అధిక మోతాదులో ఉప్పు, కారంతోపాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటిని నిరోధించేవారు కరువయ్యారు.

- విచ్చలవిడిగా స్నాక్స్ ఉత్పత్తులు
- కానరాని నాణ్యతా ప్రమాణాలు
- పట్టించుకోని ఆహార తనిఖీ అధికారులు



గ్రామాలకు తరలిస్తున్న నాసిరకమైన స్నాక్స్

విజయపురం : స్నాక్స్ అంటే ఇష్టపడని పిల్లలు లేరు. కుర్కురే, కరాచీ, చిప్స్, ఫింగర్ స్టిక్స్, క్లిప్స్, రింగ్స్, క్రేజీ బాల్, గిఫ్ట్ చాక్లెట్ ఇలా రకరకాల పేర్లతో అనేక తినుబండారాలు మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి. టీకొట్టు, కిరాణాషాపు, బేకరీ, పుట్‌పాత్, గంప వ్యాపారులు సైతం వీటిని విక్రయిస్తున్నాయి. ఎక్కువగా పాఠశాలల వద్ద ఇవి ఎక్కువగా దొరుకుతుంది. రూపాయి నుంచి రెండు, మూడు, ఐదు, పది రూపాయల వరకు వివిధ పరిమాణాల్లో లభ్యమవుతున్నాయి. చూడగానే నోరూరించేలా స్నాక్స్ ప్యాకింగ్ చేసి ఉండడంతో పిల్లలను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. బడికెళ్లే చిన్నారులు తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో వీటిని కొనుగోలు చేసుకుని తింటుడడంతో వివిధ రకాల కడుపునొప్పులతో బాధపడుతున్నారు.

దూరంగా ఉండాలి

మార్కెట్లో దొరికే చిరు తినుబండారాలు, జంక్ ఫుడ్‌కు పిల్లలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వాటిలో ఉపయోగించే రసాయనాలు, రంగులతో కడుపునొప్పి, అజీర్తి వస్తుంది. తక్షణం సంభవించే వ్యాధులతోపాటు భవిష్యత్తులో ఎసిడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ తినుబండారాలు విషయంలో పిల్లలు, పెద్దలు అందరూ జాగ్రత్తగా ఉండాలి.
– డాక్టర్ సోమశేఖర్, విజయపురం

నాణ్యతకు తిలోదకాలు

చిన్నారులు అమితంగా ఇష్టపడే స్నాక్స్‌పై కొందరు వ్యాపారులు దృష్టి కేంద్రీకరించారు. సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చారు. కొందరు బ్రాండెడ్ కంపెనీలకు దగ్గరగా అంటే ఒకటి, రెండు అక్షరాలు అటు ఇటు చేసి కంపెనీల పేర్లు పెట్టుకుని మార్కెటింగ్ చేస్తూ వేగంగా విక్రయిస్తున్నారు. మరి కొందరు పిల్లలకు ఇష్టమైన బొమ్మలను ముద్రించి విక్రయిస్తున్నారు.

రెట్టింపు ఆదాయం కోసం

బ్రాండెడ్ కంపెనీ తయారు చేసే స్నాక్స్ అమ్మితే ఒక ప్యాకెట్‌పై రూ.50 పైసలు కమీషన్ వస్తుంది. నాసిరకం తినుబండారాలు విక్రయిస్తే ప్యాకెట్‌కు రెట్టింపు ఆదాయం వస్తుండడంతో చాలా మంది వీటివైపు మొగ్గు చూపుతున్నారు. కంపెనీ స్నాక్స్ 12 ప్యాకెట్లు అమ్మితే రూ.6 ఆదాయం వస్తుంది. అదే నాసికరమైన స్నాక్స్ అమ్మడం ద్వారా రూ.12 వస్తుంది. దీంతో వ్యాపారులు చిన్నారుల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా, తమ ఆదాయం కోసం నాసిరకమైన స్నాక్స్ అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రతి నెలా లక్షల్లో వ్యాపారం

నగరి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో సుమారు 120కిపైగా పంచాయతీ, 350కి పైగా గ్రామాలు ఉండగా, అందులో ఒక్కో గ్రామానికి ఒకటి, రెండు, చొప్పున సుమారు 300 పైగా అంగళ్లు ఉన్నాయి. ఒక్కో హోల్‌సేల్ వ్యాపారి నెలకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు స్నాక్స్ దిగుమతి చేసుకొని, నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, కిరాణా షాపులకు సరఫరా చేసి అమ్ముతున్నారు.

కానరాని అధికారుల తనిఖీలు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లభించే తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, మున్సిపల్, తూనికలు, కొలతల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో స్నాక్స్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్న పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు.

శానిటేషన్ వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

నగరి : తమకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి శానిటేషన్ వర్కర్స్ కాలనీని ఏర్పాటుచేసి ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పనిచేసే కార్మికులకు కాలనీలు ఏర్పాటు చేసి ఇచ్చినట్లు చెప్పారు. నగరి మున్సిపాలిటీ పరిధిలో అనేక సందర్భాల్లో అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదన్నారు. ఇకనైనా ఇంటి పట్టాలు ఇవ్వాలని చెప్పారు. కార్మికుల ప్రావిడెంట్ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజేంద్ర, నాగరాజు, దీప, సతీష్, చినరాజ్, జానకి, రామన్, విమల, శంకర్, వినోద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో తప్పులు సవరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి వివరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుత్తూరు: ఎస్సీ వర్గీకరణలో తప్పులు వచ్చాయని వాటిని సవరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో భాగంగా ప్రభుత్వం సచివాలయాల్లో ఉంచిన వివరాల్లో తప్పులను గుర్తించినట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాల గణనలో ఎస్సీ మాదిగలకు బదులుగా ఎస్సీ ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, ఆది క్రిస్టియన్లుగా నమోదైనట్లు వివరించారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఉంచిన వివరాల్లో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో 70 శాతం మంది మాదిగలను ఎస్సీ ఆది ఆంధ్రా ఉపకులంగా చూపినట్లు తెలిపారు. ఎస్సీ మాదిగలుగా కుల గణాంకాల్లో రావాలని వారు కోరారు. లేకుంటే విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పి.మునివేలుమాదిగ, నాయకులు శివయ్యమాదిగ, బాలాజీ, నరేంద్ర బాబు, రాఘవ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వీరాంజనేయ స్వామి

నగరి : తమిళనాడు ఆనవాయితీ ప్రకారం నిర్వహించే హనుమజ్జయంతిలో భాగంగా సోమవారం స్థానిక ప్రసన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించగా భక్తులను ఆకట్టుకుంది. స్వామికి ప్రత్యేక ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గంగాధర నెల్లూరు : మన రెడ్డి జన సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ మేరకు తిరుపతిలోని నివాసంలో పెద్దిరెడ్డిని మన రెడ్డి జన సంఘం అధ్యక్షుడు ఎల్. బలరామిరెడ్డి, బాబు రెడ్డి కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమ రెడ్డి, స్థానిక నేతలు శంకర్ మొదలి, చిట్టి బాబు మొదలి, దేవేంద్ర రెడ్డి, ఢిల్లీ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

డైయింగ్ యూనిట్లను మూసేద్దాం!



సమావేశంలో డైయింగ్ యూనిట్లపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- ప్రజా సంక్షేమం కంటే రాజకీయాలు ముఖ్యం కాదు
- ధ్వజమెత్తిన మున్సిపల్ కౌన్సిలర్లు
- శుద్ధీకరణ పాటించడం లేదన్న మున్సిపల్ అధికారులు
- రసాభాసగా మున్సిపల్ సమావేశం

నగరి : అధికారులు సహకరిస్తే రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మంచిచేద్దామని, మున్సిపల్ పరిధిలోని డైయింగ్ యూనిట్లను మూకుమ్మడిగా మూసేద్దామని మున్సిపల్ కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సోమవారం చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు బడ్జెట్ వివరాలను, సర్వసభ్య సమావేశం అజెండాను చదివి వినిపించారు. అజెండాలో కానీ, బడ్జెట్ వివరాల్లో గానీ ఇతర ఏ అంశాల్లో గానీ సందేహాలుంటే చెప్పాలని కోరారు. వెంటనే కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల కారణంగా నగరి నాశనమైపోయిందని చెప్పారు. నివాసితులందరికీ కిడ్నీవ్యాధులు, సొరియాసిస్ అంటూ విచిత్రమైన వ్యాధులన్నీ వస్తున్నాయన్నారు. ఇతర ప్రాంతాల్లో పెద్ద వైద్యశాలలకు వెళ్లినా వారికి నగరి అని చెప్పగానే రసాయన నీటి కారణంగానే ఈ పరిస్థితి అని ఇట్టే చెప్పేస్తున్నారని గుర్తుచేశారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలని డైయింగ్ యూనిట్లపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు సమాధానమిస్తూ నగరి మున్సిపల్ పరిధిలో 18 భారీ డైయింగ్ యూనిట్లు గుర్తించామని వాటిలో రెండింటికి మాత్రమే అనుమతి ఉందన్నారు. ఏ డైయింగ్ యూనిట్ నిబంధనలు పాటించడం లేదని శుద్ధీకరించిన నీటిని విడుదల చేయడం లేదన్నారు. నగరిలో పలు ప్రాంతాల్లో నీటిని పరిశీలించామని అందులో జింక్, ఆర్సెనిక్ కలిసి ఉన్నట్లు రుజువైందన్నారు. ఇది దీర్ఘకాలిక వ్యాధులను కలిగిస్తుందన్నారు. దీనిపై కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ అలాంటప్పుడు ఎందుకు అన్ని ఈటీపీలను మూసివేయకూడదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో దీనిపై తీర్మానం చేద్దామన్నారు. వెంటనే ఫ్లోర్ లీడర్ దయానిధి, కౌన్సిలర్లు బిలాల్, ఇంద్రయ్య, వైస్ చైర్మన్లు వెంకటరత్నం రెడ్డి, బాలన్ ఈ అంశంపై తాము కూడా ఏకీభవిస్తున్నామన్నారు. ఎన్నో సార్లు దీనిపై పోరాడి సాధించలేకపోయామని ఈ సారి తప్పక డైయింగ్ యూనిట్లను మూసివేసేవరకు పోరాడుతామన్నారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ తనది కూడా నేత సామాజికవర్గమే అని నాకూ డైయింగ్ యూనిట్ ఉందన్నారు. అయితే కౌన్సిలర్లందరూ తీర్మానిస్తే తానూ కట్టుబడి ఉంటానన్నారు. ప్రజా సంక్షేమంకన్నా నాకు డైయింగ్ యూనిట్ ముఖ్యం కాదన్నారు. డైయింగ్ యూనిట్లు ఈటీపీ, ఆర్వో, జడ్ఎల్డీ అంటూ అనుమతులు తీసుకున్నా వంద శాతం శుద్ధీకరణ జరగదన్నది జగమెరిగిన సత్యమన్నారు. అన్ని డైయింగ్ యూనిట్లు మూసివేస్తే తాను కూడా యూనిట్‌ను మూసివేయడానికి సిద్ధమన్నారు. అయితే ఇది కట్టె..కొట్టె అంటూ నిర్ణయించే అంశం కాదని వచ్చే సమావేశంలోపు ఒక పద్ధతి ప్రకారం అన్ని యూనిట్లను మూసివేసే ప్రయత్నం చేద్దామన్నారు.

క్వారీలకు కౌన్సిల్ అనుమతి కొత్తగా ఉంది

జాతీయ రహదారి విస్తరణకు కాకవేడు రెవెన్యూ పరిధిలోని 4.94 హెక్టార్లలో గ్రావెల్ తీసుకోవడానికి ఈకేకే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారికి అనుమతి ఇచ్చేందుకు ఆమోదం కోరడంపై కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫ్లోర్ లీడర్ దయానిధి మాట్లాడుతూ గతంలో ప్రైవేటు వ్యక్తులకు ఇష్టారాజ్యంగా ఇచ్చేశారని అప్పుడంతా కౌన్సిల్ అనుమతి ఎందుకు కోరలేదన్నారు. ఇప్పుడు అనుమతి అడగడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై కౌన్సిల్ రసాభసగా మారింది. ఈ అంశానికి కౌన్సిల్ ఆమోదం తెలపలేదు.

సంక్రాంతికైనా కాంతులు వచ్చేనా?

పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మున్సిపల్ డీఈ సమాధానమిస్తూ విద్యుత్ దీపాలు వెలగకపోవడం వాస్తవమే అని దీపాలకోసం టెండర్లు వదిలామని త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. దీనిపై కౌన్సిలర్లు మాట్లాడుతూ సంక్రాంతిలోపు వెలుగులు వచ్చేనా అంటూ అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



డీఎస్పీ రవికుమార్

పుత్తూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 31న జరుపుకొనే వేడుకల్లో పోలీసుల నిబంధనలను విధిగా పాటించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జి.రవికుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. యువత సంతోషం పేరిట వింత పోకడలకు పోయి కుటుంబాల్లో విషాదాన్ని నింపవద్దని కోరారు. వినోదం పేరిట వాగులు, వంకలు, కోనల వద్దకు వెళ్లి మద్యం తాగి, వాటిలో దిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై బైక్ రైడ్స్, కేక్‌లు కట్ చేయడం, బాణసంచా పేల్చడం, పాటకచ్చేరి నిర్వహించడం వంటివి చేయరాదని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల కింద రూ.10 వేలు జరిమానా, 6 నెలల జైలు శిక్ష విధించనున్నట్లు వెల్లడించారు. మద్యం షాపులు, హోటల్స్, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, ప్రార్థనా మందిరాలు, కల్యాణ మండపాల్లో నూతన సంవత్సర వేడుకలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. వేడుకలను ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లలోనే జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నగరి : జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని సీఐ మహేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై ఎటువంటి వేడుకలకు అనుమతి లేదన్నారు. రాత్రి 10 గంటల తరువాత పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టనున్నందున ఆత్యవసరమైతేనే బయటకు రావాలని చెప్పారు. ముఖ్యమైన జంక్షన్‌లు, ప్రదేశాల్లో పికెట్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు సమయపాలన పాటించాలన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి యువకులు మద్యం తాగి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. కొంతమంది మద్యం మత్తులో గ్రూపులుగా ఏర్పడి గొడవలు జరిగి శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకలను ఆరోగ్యకరమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

హద్దు మీరితే సహించం



శ్రీనివాసంతి, సీఐ

గంగాధర నెల్లూరు : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమించి హద్దు మీరితే సహించమని సీఐ శ్రీనివాసంతి తెలిపారు. రోడ్లపై బాణసంచా కాల్చడం, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్చి నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ కార్యక్రమంలో దాతలు

నగరి : పట్టణ పరిధి బస్టాండు సమీపంలోని మునీశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించనున్న ఆర్చి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. పలువురు దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న విషయం విదితమే. ఇప్పటికే ఆలయ ఫ్లోరింగ్, ప్రహరీ, వంటగది, స్నానపుగదుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆర్చి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రహరీ గ్రిల్ ఏర్పాటుకు తాను సహకారం అందిస్తానని మురళి అనే దాత ముందుకు వచ్చారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్న దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రీ సర్వే ప్రాజెక్టుపై అవగాహన ర్యాలీ

నగరి : భూముల రీసర్వే ప్రాజెక్టుపై తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని వీఎస్‌ఆర్ పేట, సరస్వతి విలాసపురం ప్రాంతాల్లో సోమవారం రీ సర్వే ప్రాజెక్టుపై ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ కొన్ని గ్రామాల్లో జరిగిందని, మరికొన్ని ప్రాంతాల్లో జరగలేదన్నారు. అన్ని గ్రామాల్లోనూ త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఆర్‌వీ ప్రసాద్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

చెరువు నిండింది.. పంట మునిగింది



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

విజయపురం : మండలంలోని స్వామిరెడ్డికండ్రిగ చెరువు తూమును అధికారులు పూడ్చివేయడంతో సుమారు 100 ఎకరాల పట్టా భూమి నీట మునిగి, రైతులు రోడ్డున పడ్డారు. విజయపురం మండలం, పన్నూరు గ్రామానికి చెందిన సుమారు 50 మంది రైతులకు కలియంబాకం రెవెన్యూ లెక్క దాఖలాలో 100 ఎకరాల పట్టా భూమి చెరువు పైభాగంలో ఉంది. ఏడాదికి ఒకసారి పంట సాగు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షానికి బోర్లు, బావుల్లో నీళ్లు రావడంతో కొందరు రైతులు వరి నాట్లు వేయగా, మరి కొంత మంది నార్లు పోశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు పూర్తిగా నిండిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు చెరువుకు వచ్చి చేరడంతో పైభాగంలో ఉన్న పంటలన్నీ పూర్తిగా నీట మునిగిపోయాయి. దీనికి తోడు అధికారులు తూమును పూర్తిగా పూడ్చేయడంతో సుమారు 100 ఎకరాల పట్టా భూమి నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఇరిగేషన్ ఏఈ, తహసీల్దార్, ఆర్డీఓకు మొరపెట్టుకొన్నా పట్టించుకోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ. 20 చొప్పున ఖర్చు చేశామని, పంట చేతికందకపోతే అప్పులపాలవుతామని, జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.